క్లుప్తంగా

ఆదమరిస్తే.. అంతే సంగతులు



గురజాల : ఆదమరచి వెళ్లామా అంతే సంగతులు అన్నట్లు గురజాల ఆర్టీసీ బస్టాండ్ బయటకు వచ్చే ప్రదేశంలో చప్టా ధ్వంసమై కనిపిస్తోంది. ప్రయాణికులు, స్థానికులు దీనివల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చప్టా విరిగిపోయి నెలలు కావస్తున్నా ఆర్టీసీ అధికారులు మాత్రం స్పందించడం లేదు. నిత్యం ఎవరో ఒకరు ఇందులో పడి గాయపడుతున్నారు. మరమ్మతులు చేయాలనే ఆలోచన అధికారులకు రాకపోవడం బాధాకరంగా ఉందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. బస్టాండ్ బయటకు రావడానికి టర్నింగ్ పాయింట్ కావడంతో బస్సు డ్రైవర్లకు కూడా పెద్ద పరీక్షగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

దివ్యాంగులపై సరైన శ్రద్ధ అవసరం



దాచేపల్లి : ప్రత్యేక అవసరాలు కలిగిన మానసిక దివ్యాంగులపై తగిన శ్రద్ధ చూపాలని సీఐ బాలకృష్ణ అన్నారు. దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలోని ఫాతిమా మాత విభిన్న ప్రతిభావంతుల పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బహుమతులు అందించారు. పాఠశాలలో వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. చిన్నపిల్లల్లా వారిని చూసుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు మహిళ ప్రధాన కార్యదర్శి కర్నాటి వరలక్ష్మి, నాయకులు మక్కెన అమరకృష్ణ, ఉల్లంగుల వెంకటేశ్వరరావు, మక్కెన వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

భవిత పాఠశాలలో ఆకస్మిక తనిఖీ



గురజాల: భవిత పాఠశాలలో రాష్ట్ర కో ఆర్డినేటర్ మల్లికార్జునరావు గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు, వారికి కల్పించిన వసతులపై ఆరా తీశారు. ఉపాధ్యాయులకు సంబంధించిన రిజిస్టర్లు సక్రమంగా ఉన్నాయా? లేవా? అని పరిశీలించారు. ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థుల వివరాలు యాప్‌లో నమోదు వంటి అంశాలను కూడా పరిశీలించారు. ప్రభుత్వం నుంచి విద్యార్థులకు పథకాలు సక్రమంగా అందేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కో ఆర్డినేటర్, జిల్లా కో ఆర్డినేటర్, ఉపాధ్యాయులు మాచర్ల విజయలక్ష్మి, ఝాన్సీ రాణి, ఫిజియోథెరపిస్టు వినుకొండ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

13న ఉచిత మెగా వైద్య శిబిరం

పిడుగురాళ్ల: పట్టణంలోని శ్రీదత్త హాస్పిటల్ ఆధ్వర్యంలో లెనిన్ నగర్ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఈ నెల 13వ తేదీన ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆసుపత్రి మేనేజర్ కృష్ణప్రసాద్ తెలిపారు. డాక్టర్ గార్లపాటి కృష్ణకాంత్ నేతృత్వంలో ఈ శిబిరం ఉంటుందని, స్థానికులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నర్సరీలకు అనుమతులు తప్పనిసరి



పెదకూరపాడు: పెదకూరపాడు నియోజకవర్గంలో మిరప నర్సరీల నిర్వహణ యజమానులు తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలని ఉద్యాన శాఖాధికారి తోటకూర శ్రీనిత్య కోరారు. మండలంలోని పలు గ్రామాల్లో నర్సరీలను పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీనిత్య మాట్లాడుతూ తప్పనిసరిగా లైసెన్స్ తీసుకోవాలని, లేకపోతే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. పలువురు మిరప నర్సరీల యజమానులతో ఆమె మాట్లాడారు. నర్సరీలను నిర్వహించే యజమానులు తప్పనిసరిగా రెండు ద్వారాలు ఏర్పాటు చేసుకోవాలని, బెడ్‌ల మధ్య దూరం ఉండాలన్నారు. గడ్డి రాకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. లైసెన్స్ లేని యజమానులకు నోటీసులు అందించారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థుల ఎంపిక



కృపాసామ్యేలును అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు తదితరులు

గురజాల : నగర పంచాయతీ పరిధిలోని జంగమహేశ్వరపురంలో జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పదో తరగతి చదివిన చేవూరి కృపాసామ్యేలు ట్రిపుల్ ఐటీ ఒంగోలు బ్రాంచిలో సీటు సాధించాడు. విద్యార్థిని ప్రధానోపాధ్యాయుడు వై. శివారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

ఆదర్శ పాఠశాల విద్యార్థిని...

కారెంపూడి: స్థానిక ఆదర్శ పాఠశాల విద్యార్థిని షేక్ నౌసిన్‌కు నూజివీడు బ్రాంచిలో ట్రిపుల్ ఐటీ సీటు వచ్చింది. నౌసిన్ కారెంపూడిలో తాత షేక్ షరీఫ్ వద్ద ఉంటూ చదివింది. పదో తరగతిలో 576 మార్కులు సాధించి స్కూలు టాపర్‌గా నిలిచింది. నౌసిన్‌ను పాఠశాల ప్రిన్సిపల్ ఎస్. నయోమి, ఉపాధ్యాయులు గురువారం అభినందించారు.

ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి..

విజయపురి సౌత్: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి నీలం అజయ్‌కుమార్ పదో తరగతిలో 571 మార్కులు సాధించాడు. నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో సీటు పొందాడు. గురువారం ఇన్‌చార్జి హెచ్‌ఎం యు. లక్ష్మి, ఉపాధ్యాయులు అతడిని అభినందించారు.

పిన్నెల్లి స్కూలు నుంచి ఇద్దరు...

మాచవరం: మండలంలోని పిన్నెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ట్రిపుల్ ఐటీలో సీటు పొందినట్లు ఉపాధ్యాయుడు జమాల్ గురువారం తెలిపారు. 10వ తరగతిలో ఆంగ్ల మీడియంలో 576 మార్కులు సాధించిన ఎస్‌కే ఎండీ ఫరూక్‌కు నూజివీడులో సీటు వచ్చింది. ఇదే పాఠశాలలో 571 మార్కులు పొందిన ఎస్‌కే ఎండీ ఎస్. జానీ బాషాకు ఒంగోలులో సీటు వచ్చినట్లు జమాల్ తెలిపారు.



షేక్ నౌసిన్



ఫరూక్



జానీ బాషా



అజయ్‌కుమార్‌ను అభినందిస్తున్న ఇన్‌చార్జి హెచ్‌ఎం లక్ష్మి, ఉపాధ్యాయులు

నాణ్యమైన విద్యుత్తు అందించేందుకు కృషి



సిబ్బందితో మాట్లాడుతున్న డీఈ జె. హరిబాబు

మాచర్ల రూరల్ సరఫరాలో అంతరాయాలు లేకుండా వినియోగదారుడికి నాణ్యమైన విద్యుత్ అందించేందుకు సిబ్బంది నిరంతరం కృషి చేయాలని విద్యుత్ శాఖ డీఈ జె. హరిబాబు కోరారు. గురువారం విద్యుత్ కార్యాలయంలో సిబ్బందితో ఆయన మాట్లాడారు. భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని, వర్షాకాలంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. బిల్లు బకాయిల వసూలుపైనా దృష్టి పెట్టాలన్నారు. మొండి బకాయిలపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని పేర్కొన్నారు. విద్యుత్ రంగంలో మార్పులను వినియోగదారులకు ఎప్పటికప్పుడు వివరించాలని సూచించారు. సమావేశంలో ఏడీఈ రామయ్య, ఏఈ నాయక్, ఏఏవో చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ కార్యదర్శులు స్థానికంగా ఉండాలి

- నిరంతరం పారిశుద్ధ్యంపై పర్యవేక్షణ చేయాలి
- ఆరోగ్య, పంచాయతీ సిబ్బందికి సమన్వయం అవసరం
- జిల్లా పంచాయతీ అధికారి భాస్కర్‌రెడ్డి



పెదకూరపాడు పంచాయతీ సిబ్బందితో మాట్లాడుతున్న భాస్కర్‌రెడ్డి

పెదకూరపాడు: జిల్లాలో గ్రామ కార్యదర్శులు వారు పనిచేసే గ్రామాల్లోనే స్థానికంగా నివాసం ఉండి నిరంతరం పారిశుద్ధ్యంపై పర్యవేక్షణ చేయాలని జిల్లా పంచాయతీ అధికారి భాస్కర్ రెడ్డి తెలిపారు. గురువారం పెదకూరపాడు గ్రామంలో పర్యటించి, పంచాయతీ కార్యాలయంలో ఆడిట్ నిర్వహించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ సీజనల్ వ్యాధులతో పాటు డయేరియా గ్రామాల్లో ప్రబలకుండా ఆరోగ్య, పంచాయతీ సిబ్బంది సమన్వయంతో పని చేసి పారిశుద్ధ్య మెరుగుదల పనులు చేయాలన్నారు. ప్రతి రోజు గ్రామ కార్యదర్శి మూడు గంటల పాటు గ్రామాల్లో పర్యటించి అపరిశుభ్రతగా ఉన్న ప్రాంతాల్లో శానిటేషన్ పనులు చేయించి యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన చర్యలపై సిబ్బందితో చర్చించారు. నీటి సరఫరాలో పైపులు లీక్ కాకుండా చూసుకోవాలన్నారు. స్థానికంగా నివాసం ఉండి ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. డయేరియా కేసులు నమోదయితే చర్యలు తప్పవని హెచ్చరించారు. పంచాయతీ సిబ్బంది పనితీరును, హాజరు పట్టికను పరిశీలించి పలు సూచనలు చేశారు. వారి వెంట శ్రీనివాసరెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రారంభానికి సిద్ధంగా బస్ షెల్టర్




అచ్చంపేట: స్థానిక పీహెచ్‌సీ, జెడ్పీ హైస్కూలు, శివాలయాలకు సమీపంలో స్నేహ హస్తాలు ఫౌండేషన్ వారిచే రూ.5 లక్షల వ్యయంతో నిర్మించిన బస్ షెల్టర్ ప్రారంభానికి సిద్ధమైంది. ఈ నెల 13న స్థానిక ఎమ్మెల్యే, ఎంపీలచే ప్రారంభించ బడుతుందని స్నేహ హస్తాలు ఫౌండేషన్ ప్రతినిధి తాయి కరిముల్లాబాబు గురువారం తెలిపారు. మండలంలో 23 గ్రామ పంచాయతీలు, 28 గ్రామాలుండగా బస్టాండు ఊరికి కిలోమీటరు దూరంలో నిర్మించడం వల్ల ప్రయాణికులెవ్వరూ బస్టాండుకు వెళ్లడం లేదని, బస్సులను కూడా హైస్కూలు వద్దనే తిప్పుతున్నారని చెప్పారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి వివిధ పనులపై వచ్చే విద్యార్థులు, రైతులు, వ్యాపారులు, వైద్యశాలకు వచ్చే రోగులు గంటల తరబడి రోడ్డుపై వేచి ఉండాల్సి రావడాన్ని గమనించి పంచాయతీ అనుమతితో బస్ షెల్టర్ నిర్మించినట్లు కరిముల్లా బాబు తెలిపారు.

సాయిబాబాకు ప్రత్యేక పూజలు



పాలువాయి జంక్షన్ (రెంటచింతల): మండల పరిధిలోని పాలువాయి జంక్షన్ వద్ద షిరిడీ సాయిబాబా ఆలయంలో గురువారం అర్చకులు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. పల్నాడు ప్రాంతంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో వచ్చారు. సాయిబాబాను మొక్కి, పూజల్లో పాల్గొన్నారు. ఆలయ ఆవరణలో భజనబృందం బాబా గీతాలను ఆలపించింది.

శాకాంబరీ దేవిగా దుర్గా అన్నపూర్ణేశ్వరి



సత్తెనపల్లి: అమ్మవారికి అత్యంత ప్రీతిపాత్రమైన ఆషాఢ మాసం పురస్కరించుకొని పట్టణంలోని అచ్చంపేట రోడ్‌లోని దుర్గా అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి దేవాలయంలో గురువారం దుర్గా అన్నపూర్ణేశ్వరి అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో శాకాంబరీ దేవిగా అలంకరణ చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారికి పూజలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా దేవదాయ, ధర్మాదాయ శాఖ అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

జనాభా నియంత్రణతో మెరుగైన సమాజం



పణిదంలో ర్యాలీలో డాక్టర్ సాయి తేజారెడ్డి, సిబ్బంది



దొడ్లేరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ర్యాలీలో డాక్టర్ సిరిచందన, సిబ్బంది

సత్తెనపల్లి: జనాభా నియంత్రణతోనే మెరుగైన సమాజం సాధ్యపడుతుందని ఫణిదం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సాయితేజరెడ్డి అన్నారు. ఫణిదం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సాయి తేజ రెడ్డి మాట్లాడుతూ జనాభా నియంత్రణతో పేదరికం నిర్మూలన సాధ్యమవుతుందన్నారు. జనాభా నియంత్రణ పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. జనాభా పెరుగుదల అనర్థాలకు దారితీస్తుందని.. చిన్న కుటుంబం అన్ని రకాలుగా మంచిదని, ప్రభుత్వం అందించే వైద్య సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం జనాభా నియంత్రణపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవోపీ శ్రీనివాసరావు, హెల్త్ సూపర్‌వైజర్లు ఏ వరలక్ష్మి, షేక్ కరీముల్లా, స్టాఫ్‌నర్స్ నాగమణి, ఫార్మసిస్ట్ ఐశ్వర్య, ల్యాబ్ టెక్నీషియన్ అనిల్, హెల్త్ సెక్రటరీ జే కోటిరత్నం, ఎఫ్‌ఎంవో యశోద, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ర్యాలీ

క్రోసూరు: మండలంలోని క్రోసూరు, దొడ్లేరు పీహెచ్‌సీల ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ జనాభా దినోత్సవ అవగాహన ర్యాలీలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులు, ఆరోగ్య సిబ్బంది గ్రామంలో తిరుగుతూ చిన్న కుంటుంబం చింతలేని కుటుంబమని, కాన్పుల మధ్య ఎడం తల్లిబిడ్డల ఆరోగ్యం, కుటుంబ నియంత్రణ పాటించండి- ఆరోగ్యంగా జీవించండి, బాల్య వివాహాలు వద్దు, సరియైన వయస్సులో వివాహం ముద్దు, కుటుంబ సంక్షేమం, దేశ సౌభాగ్యం, అంటూ నినాదలు చేశారు. ఈ కార్యక్రమంలో క్రోసూరు పీహెచ్‌సీ డాక్టర్ ఇన్నారావు, సిబ్బంది, దొడ్లేరు పీహెచ్‌సీ డాక్టర్ సిరిచందన, సిబ్బంది పాల్గొన్నారు.

దమ్మాలపాడులో..

దమ్మాలపాడు(ముప్పాళ్ల): చిన్నారులకు క్రమ పద్ధతిలో టీకాలు ఇప్పించాలని పీహెచ్‌సీ వైద్యాధికారి జయకృష్ణ అన్నారు. మండలంలోని దమ్మాలపాడు గ్రామ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు, ర్యాలీ గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న పీహెచ్‌సీ వైద్యులు జయకృష్ణ మాట్లాడుతూ సరైన సమయంలో గర్భధారణ జరిగితే తల్లి.. బిడ్డకు మంచిదని, ఆరోగ్యమైన బిడ్డలు జన్మిస్తారని చెప్పారు. బిడ్డకు బిడ్డకు మధ్య అంతరం ఉండాలన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు ఎ.పీటర్‌డేమియన్, ఎం.జోస్పిన్‌రాణి, సీహెచ్‌వో రహిమున్నిసా, ఏఎన్‌ఎం మస్తాన్‌బి, 104 సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లోనూ ప్రపంచ జనాభా దినోత్సవ ర్యాలీలు నిర్వహించారు.



దమ్మాలపాడు ర్యాలీలో పీహెచ్‌సీ వైద్యాధికారి జయకృష్ణ

తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలి



మాట్లాడుతున్న హెచ్‌ఎం ఉషశ్రీ

గురజాల : పాఠశాల లేని సమయంలో విద్యార్థులు ఏం చేస్తున్నారనే విషయాన్ని తల్లిదండ్రులు గమనించాల్సిన అవసరం ఉందని హెచ్‌ఎం ఉషశ్రీ సూచించారు. ఈ విషయంలో వారు బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. మండల పరిధిలోని పల్లెగుంత గ్రామంలో ఏపీ మోడల్ పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇంటి వద్ద పిల్లలు ఏం చేస్తున్నారు? ఎలా చదువుతున్నారు? అనే విషయాలను తల్లిదండ్రులు గమనించాలని చెప్పారు. విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉండాలంటే ఉపాధ్యాయులతోపాటు తల్లిదండ్రుల పాత్ర కూడా కీలకమన్నారు. సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పాస్టర్ ఏసురత్నం సేవలు అభినందనీయం



పాస్టర్ ఏసురత్నాన్ని సన్మానిస్తున్న దృశ్యం

దుర్గి: మండల పరిధిలోని ముటుకూరు ఆంధ్రా ఇవాంజిలికల్ లూథరన్ చర్చి (ఏఈఎల్‌సీ) పాస్టర్‌గా పనిచేస్తున్న పేరుపోగు ఏసురత్నానికి స్థానికులు ఘనంగా వీడ్కోలు పలికారు. గురువారం చర్చి ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి పలువురు ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు, చర్చి కమిటీ సభ్యులు హాజరయ్యారు. ఐదు సంవత్సరాలుగా దేవుడి సేవలు చేస్తూ గ్రామ అభివృద్ధిని ఆకాంక్షిస్తూ పలు సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు స్థానికులు గుర్తు చేశారు. ఆయన సేవలు అభినందనీయం అన్నారు. బదిలీపై ఆయన చర్లగుడిపాడు వెళ్లడం తమకు కాస్త బాధగా ఉందన్నారు. కానీ దేవుడి సేవ కోసమే ఇదంతా అని, అక్కడ కూడా మంచి పేరు పొందాలని ఆకాంక్షించారు. అనంతరం పాస్టర్‌ను శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఏచూరి సాయి శంకర్, గ్రామ పెద్దలు లింగా బ్రహ్మయ్య, తోటకూర శ్రీనివాసరావు, లింగా సాంబశివరావు, దొండపాటి చెన్నయ్య, సంఘస్థులు మాచర్ల చిన పేరయ్య, డెలిగేట్లు జక్రయ్య, పులిమెల అన్నారావు, ఎంఆర్‌పీఎస్ మండల అధ్యక్షుడు కుక్కమూడి ప్రసాద్, కుక్కమూడి ఏసోబు, టీబీసీ మెంబరు మాచర్ల మైఖేల్, మాచర్ల ఇజ్రాయేలు, యోహాను, దానయ్య, రోశయ్య తదితరులు పాల్గొన్నారు.

చిన్న కుటుంబంతో చింత దూరం



రెంటచింతలలో ర్యాలీ నిర్వహిస్తున్న మెడికల్ ఆఫీసర్ రమాదేవి, పీహెచ్‌సీ సిబ్బంది

రెంటచింతల: ప్రస్తుత పరిస్థితులలో చిన్న కుటుంబంతో చింత ఉండదని స్థానిక పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ రమాదేవి అన్నారు. గురువారం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా స్థానిక పీహెచ్‌సీ నుంచి గ్రామంలోని పలు వీధుల మీదుగా ఆరోగ్య, ఆశా కార్యకర్తలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ రమాదేవి మాట్లాడుతూ ప్రపంచ జనాభా విపరీతంగా పెరిగిపోతోందని చెప్పారు. దీంతో చాలా అనర్థాలు ఉన్నట్లు తెలిపారు. జనాభా నియంత్రణ కోసం ప్రతి భారతీయుడు తన వంతుగా కృషి చేయాలన్నారు. చట్టప్రకారం వివాహ వయస్సు వచ్చిన తర్వాతే పెళ్లి చేసుకోవాలని, కాన్పులకు కనీసం మూడేళ్ల గ్యాప్ ఉండేలా చూసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ ఈవో ఎస్. ఆంజనేయులు, ఏడీ శర్మ, సూపర్‌వైజర్లు ఎస్. కోటేశ్వరరావు, లక్ష్మీప్రసన్న, నిర్మల, ఆరోగ్య కార్యకర్తలు మహేష్ బాబు, సీతారామిరెడ్డి, కాశిం, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పమిడిపాడులో ఉచిత వైద్య శిబిరం



వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

నరసరావుపేటరూరల్: మండలంలోని పమిడిపాడు గ్రామంలో శ్రీ దత్త హాస్పిటల్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరంలో హాస్పిటల్ మేనేజింగ డైరెక్టర్, గుండె వ్యాధుల వైద్య నిపుణులు డాక్టర్ గార్లపాటి కృష్ణకాంత్, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ చల్లా వెంకటేశ్వరరావు, స్త్రీ వ్యాధుల వైద్య నిపుణులు డాక్టర్ శాంతిలు పాల్గొని రోగులకు వైద్య పరీక్షలు జరిపారు. 150 మందికి పరీక్షించి వారికి ఉచితంగా బీపీ, షుగరు, ఈసీజీ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ గార్లపాటి కృష్ణకాంత్ మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించాలనే లక్ష్యంతో ఈ వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని రైతులు, రైతుకూలీలను దృష్టిలో ఉంచుకొని వారి సమయానుకూలంగా ఈవినింగ్ హెల్త్ క్యాంప్స్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శ్రీ దత్త సూపర్ స్పెషాలిటి హాస్పిటల్‌లో గుండె, కిడ్నీ, మెదడు, వెన్నుముక, ఊపిరితిత్తులు, శ్వాసకోశ వ్యాధులు, బీపీ, షుగర్, స్త్రీ, ప్రసూతి వ్యాధులకు, అన్నిరకాల ఎమర్జెన్సీలకు అనుభవజ్ఞులైన వైద్యుల సమక్షంలో వైద్య సేవలు అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో మార్కెటింగ్ మేనేజర్ షేక్ ఖాసీం సైదా, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ ఫరూక్, శ్రీనివాస్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ



నాదెండ్ల: విద్యలో ప్రతిభ చూపిన విద్యార్థులను ఎంపిక చేసి ప్రతి గ్రామం నుంచి ఒకరికి ఉచిత విద్యను అందిస్తున్నట్లు నరసరావుపేట టైనీ థాట్స్ విద్యా సంస్థల డైరెక్టర్ వై.కోటమ్మ చెప్పారు. మండలంలోని చందవరం ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో గురువారం ఉచితంగా సంస్థ ఆధ్వర్యంలో నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద విద్యార్థులకు సాయమందించేందుకు తాము ముందుంటామన్నారు. తమ సంస్థలో ప్రస్తుతం 50 మంది విద్యార్థులకు ఉచిత విద్యను అందిస్తున్నట్లు చెప్పారు. విద్యలో ప్రతిభ కనబరచిన వారిని గుర్తించి తల్లిదండ్రులు, విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపి వారిని ప్రోత్సహించాలన్నారు. తాను తన విద్యాభ్యాసం ప్రభుత్వం పాఠశాలలోనే పూర్తిచేశానన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలతో పాటూ తమలాంటి సంస్థలు అందించే సాయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు వీరయ్య చౌదరి, సతీష్, అన్నపూర్ణేశ్వరి, ఉపాధ్యాయులు షరీఫ్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నాదెండ్ల: మండలంలోని సాతులూరు గ్రామంలో పలు అభివృద్ధి పనులకు సర్పంచ్ ముసుగు శోభారాణి గురువారం శంకుస్థాపన చేశారు. రైతులు పొలాలకు వెళ్లే డొంక రోడ్లు అధ్వానంగా ఉండటంతో స్థానిక ఎమ్మెల్యే సహకారంతో రోడ్డు పనులు ప్రారంభించారు. గ్రామం నుండి కేసానుపల్లి వెళ్లే రోడ్డు, ఎస్ఎస్‌పీ కాలువ బ్రిడ్జి నుంచి కనపర్రు వెళ్లే రోడ్డు, ఎస్ఎస్‌పీ కాలువ బ్రిడ్జి నుంచి కాలువ కట్టవరకూ గ్రావెల్ రోడ్లు వేయనున్నారు. ఈ పనులు పూర్తయితే రైతులు, వాహనదారులకు రోడ్డు సౌకర్యం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు బండారుపల్లి సత్యనారాయణ, నాయకులు జంపని వీరవసంతరావు, నందిగం శివయ్య, నార్నె శ్రీనివాసరావు ఉన్నారు.

ఘనంగా ప్రపంచ జనాభా దినోత్సవం

రొంపిచర్ల: మండలంలోని వి.రెడ్డిపాలెం, రొంపిచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ జనాభా దినోత్సవ వేడుకలు, డెంగ్యూ, మలేరియా నివారణ మాసోత్సవాలు నిర్వహించారు. మండలంలో వి.రెడ్డిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల మర్రిచెట్టు పాలెంలో గల అన్ని పాఠశాలలలో వేడుకలు నిర్వహించారు